40 దశాబ్దాలకు పైగా జర్నలిజం సేవతో పాటు సాంప్రదాయ శిల్ప, కళ మరియు సంస్కృతిలో పని చేస్తున్నసీనియర్ ఫోటో జర్నలిస్ట్ కె.రమేష్‌బాబుకు శుక్రవారం హైదరాబాద్ జెఎన్ టి యూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని నెహ్రూ ఆర్ట్ గేలరీ లో ప్రారంభమైన ఆర్ట్ ఎక్సిబిషన్ లో "డార్లా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.గంగాధర్, చిత్రంలో దార్ల నాగేశ్వరరావు కూడా ఉన్నారు.

నిధులు విడుదల చేయాలని జడ్సీకి వినతి

జడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, ఫిబ్రవరి 7: మెట్టుగూడ అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ కు కార్పొరేటర్ రాసూరి సునీత కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. నిధులను మంజూరు చేయడంలో జాప్యం చేయకుండా ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత త్వరగా సంబంధించిన నిధులను వెంటనే ఇవ్వాలని ఆమె జడ్సీని కోరారు.

11నపద్య కావ్యం ఆవిష్కరణ

ముషీరాబాద్: ఉపాసన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న డాక్టర్ ధూళిపాళ మహాదేవ మణి రచించిన బృహత్ శ్రీధరీయం పద్య కావ్యం ఆవిష్కరించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు డాక్టర్ మహేశ్వరి, వోలేటి సీతాపతి, దివాకర్ రావు, కళ్యాణి శుక్రవారం త్యాగరాయ గానసభలో తెలిపారు.

బూట్‌క్యాంప్ విజయవంతం

● ముగిసిన నాలుగు రోజుల వీడియో ఎడిటింగ్ శిక్షణ ● హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ధ్రువ పత్రాలు అందజేత

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేస్తున్న ప్రతినిధులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7: ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4 నుంచి వరకు నాలుగు రోజుల వీడియో ఎడిటింగ్ బూట్‌క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. శిక్షణ హెచ్ సీడీసీ కార్యాలయం, సీఎఫ్‌ఆర్డీ భవనం, ఓయూ క్యాంపస్ లోని ఈ క్లాస్ రూమ్ లో ప్రతిరోజు ఉదయం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓయూ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఐ.శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజని, సమన్వయకర్త డాక్టర్ మురళీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ క్యాంపస్ అనుబంధ కళాశాలల నుంచి వచ్చిన పీజీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఐ.శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని అభినందిస్తూ, వీడియో ఎడిటింగ్ విద్యార్థులకు ప్రొఫెషనల్, పర్సనల్ ప్రాజెక్టులకు ఉపయోగపడే కీలకమైన నైపుణ్యం అని తెలిపారు. ప్రొఫెసర్ రంజని, డాక్టర్ మురళీధర్ రెడ్డి వీడియో ఎడిటింగ్ ఇంటర్న్‌షిప్, పూర్తిస్థాయి ఉద్యోగ అవకాశాలకు మార్గదర్శిగా నిలుస్తుందని తెలిపారు.

ఆపదలో సీఎం సహాయ నిధితో భరోసా

ఎల్ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 7: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఐదవ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు యాదగిరి సోదరుడు నరేష్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్‌కు అవసరం అయ్యే ఖర్చు భరించే స్థోమత లేకపోవడంతో బీఆర్ ఎస్ సీనియర్ నాయకుడు రావుల సతీష్ ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ ఎఫ్ నుంచి రూ.1 లక్ష 15 వేల ఎల్ఓసీ పత్రాన్ని మంజూరు చేయించారు. శుక్రవారం తన కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్, అనిల్ కిషోర్, సురేష్, యాదగిరి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం ఎన్నిక

ముషీరాబాద్, ఫిబ్రవరి 7: పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా కాంపాటి పృథ్వీ, సాయిబోల అనిల్ నియమితులయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్య పూర్తిగా ప్రైవేటికరణ బడిందని, ప్రాథమిక విద్యను పట్టించుకోకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇంటరీడియట్ విద్య పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతుల్లో వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నర్సింహారావు, బి.భాస్కర్, నరేందర్, అఖిల్, రాకేష్, సాయికుమార్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని తెలంగాణ ఉద్యమకారుడు మృతి

చిక్కడపల్లి, ఫిబ్రవరి7: ఆటో ఢీకొని తెలంగాణ ఉద్యమకారుడు, కవాడిగూడకు చెందిన బీజేపీ రాష్ట్ర నేత రంగరాజ్‌గౌడ్ మృతిచెందాడు. మరో వ్యక్తి రాగం రవికుమార్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం సాయంత్రం ద్విచ్రకవాహనంపై కవాడిగూడ బీజేపీ కార్యాలయానికి వెళ్తుండగా చిక్కడపల్లి మ్రెటో స్టేషన్ వద్ద ఆటో ఢీకొట్టడంతో రంగరాజ్‌గౌడ్ తలకు గాయాలై అక్కడికక్కడే మరణించాడు. రవికుమార్‌కు గాయాలయ్యాయి. రంగరాజ్‌గౌడ్‌కు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1983 నుంచి బీజేపీలో కొనసాగుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుప్రతికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేత

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేసిన మహంకాళి దేవాలయ ఈఓ, అర్చకులు

బేగంపేట్, ఫిబ్రవరి 7: సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో జరుగనున్న కోటి కుంకుమార్చనకు రావాలని దేవాలయ ఈఓ, అర్చకులు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. శుక్రవారం మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తలసానిని కలిసిన ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం నిర్వహించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, అర్చకులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాన

ఎమ్మెల్యే తలసానిని కలిసిన నోటరీ, టైపిస్ట్, స్టాంప్ వెండర్లు

బేగంపేట్, ఫిబ్రవరి 7: సికింద్రాబాద్ కోర్టు వద్ద జీవనోపాధి పొందుతున్న నోటరీ, టైపిస్ట్‌లు, స్టాంప్ వెండర్లకు తాను అండగా ఉంటానని, ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు తలసానిని కలిసి తమ సమస్యలు ఆయనకు వివరించారు. ఎన్నో ఏండ్లుగా తాము కోర్టు పరిసరాల్లో జీవనోపాధి పొందుతున్నామని, ఇటీవల ట్రాఫిక్ పోలీసులు మూడు రోజుల్లోగా ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని, ఇప్పుడు తాము ఎక్కడికి వెళ్లాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉపాధి కోల్పోయి, కుటుంబాలు వీధిన పడతాయని వారు మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రసాద్‌రావు, వనిత, ప్రవీణ్‌కుమార్, వినోద్, సత్యనారాయణ, మదన్ తదితరులు ఉన్నారు.

ఈఎస్ఐని సొసైటీగా మార్చొద్దు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 7: బీమా వైద్య సేవల శాఖను మూసివేసి కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము వ్యతిరేకిస్తున్నామని బీమా వైద్య సేవల శాఖ (ఈఎస్ఐ) ఉద్యోగులు అన్నారు. శుక్రవారం 11వ రోజు డైరెక్టరేట్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ డైరెక్టరేట్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వీరన్నగౌడ్ మాట్లాడుతూ ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీల ద్వారా 20 లక్షల మంది కార్మికులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న, బీమా వైద్య సేవల శాఖను యథావిధిగా కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. టీఎన్‌జీఓ డీఐఎంఎస్ యూనిట్ అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి రాఘవేందర్, నర్సింగ్ రావు, అపరంజిని, గోపికిరణ్, రవీందర్, నవాజ్‌రెడ్డి, ప్రమోద్, లక్ష్మి, రాజ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

సికింద్రాబాద్, ఫిబ్రవరి7: బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో ప్రజల తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నమని కార్పొరేటర్ శైలజ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వారాసిగూడలో సీసీ రోడ్ నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు కలిసి పరిష్కరిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ లావణ్యతో పాటు బీ ఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, రాజేష్, కలీం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం

విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి

బొల్లారం, ఫిబ్రవరి 7: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో రాణించడం అభినందనీయమని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి అన్నారు. హైదరాబాద్ జిల్లా పాఠశాల క్రీడల ఫెడరేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ (అండర్ 17, అండర్ 14) పోటీలు నిర్వహించారు. పోటీల్లో కంటోన్మెంట్ తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి విజేతలకు శుక్రవారం జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మల, కోచ్ సురేష్, హరిక, దీపిక, విద్యార్థులు జాహ్నవి లక్ష్మి, సుమలీల, నాన్సీ, సిద్దీక్ష తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

అడ్డగుట్ట, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరు నులిపురుగుల నివారణపై అవగాహనను పెంచుకోవాలని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వీరు అన్నారు. ఈ నెల10వ తేదీన నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశవర్కర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1–19 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్ధేశించిన మోతాదులో మాత్రలను వేస్తారని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ, పాఠశాలల్లో మాత్రలను వేస్తారని, అందరూ గమనించాలని ఆయన సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 7: న్యూబోయిగూడలోని సున్నంబట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలతతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్ళి, పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మిపతి, లంబుశ్రీను, నాగభూషణం, కుషాల్, లక్ష్మినారాయణ, నర్సింగ్‌రావు, మహేశ్, ఏసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలి

సికింద్రాబాద్, ఫిబ్రవరి7: రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో చేపట్టే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే చేపట్టాలని తెలంగాణ డాక్టరేట్స్ అసోసియేషన్(టీజీడీఏ) స్క్రీనింగ్ టెస్టుల పేరుతో రిక్రూట్‌మెంట్‌ను వివాదస్పదం చేయకుండా యూజీసీ నిబంధనల మేరకు ప్రక్రియను చేపట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొలాడి రమణరావు, అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బొల్లం తిరుపతి, ధాత్రిక స్వప్న, అధికార ప్రతినిధులు రవి తేజ, తిరుపతి, వినయ్, స్వామినాయక్ లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. నిరుద్యోగులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అమలు కావడానికి వీలులేని సూచనలు, సలహాలు ప్రభుత్వానికి ఇచ్చి రిక్రూట్‌మెంట్‌లో వివాదాలు లేవనెత్తే విధంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2013లో చేపట్టిన రిక్రూట్‌మెంట్ మాదిరిగానే చేపట్టాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వారిలో అన్ని అర్హతలు కలిగి ఉన్న పోరాటం చేసిన ఉన్నత విద్యావంతులను కాదని.. నాన్ లోకల్ అభ్యర్థులకు ప్రొఫెసర్ పోస్టులను కట్టబెట్టే విధంగా చర్యలు చేపడుతున్నారని వాపోయారు. యూనివర్సిటీలో ప్రొఫెసర్ల నియామకం విధానంపై నియమించిన త్రిమెన్ కమిటీలో కీలక పాత్ర పోషిస్తున్న ఓ ప్రొఫెసర్ ప్రభుత్వానికి తప్పుడు రిపోర్టు ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టు తెలిసిందని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పాత పద్ధతిలో చేపట్టిన మాదిరిగానే రిక్రూట్ మెంట్ చేపడితే ఎలాంటి వివాదాలు లేకుండా ఉంటుందని గుర్తు చేశారు. యూనివర్సిటీల్లో నియామకాలను పారదర్శకంగా చేపట్టేందుకు దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు చేపడుతున్న విధానాన్ని కూడా అనుసరించ వచ్చని కోరారు. అయితే.. నిరుద్యోగుల సూచనలను, సలహాలను తీసుకోకుండా ఏక పక్షంగా రిక్రూట్‌మెంట్‌లో ముందుకు వెళ్తే ఇబ్బందులు తప్పవన్నారు. ఏదైనా కొత్త విధానమంటూ ముందుకు వెళ్తే కోర్టుల్లో న్యాయవాద చిక్కులు కూడా ఉంటాయని హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా ఈ సారి చేపట్టే రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలో చేపట్టి యూనివర్సిటీలను బలోపేతం చేయాలని, ఇప్పటి వరకు అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 2వేలకు పైగా ఉన్న పోస్టులను ఒకే సారి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు చెప్పిన విషయాలను విన్న ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సానుకూలంగా స్పందించారు. రిక్రూట్‌మెంట్‌లో ఎలాంటి వివాదం లేకుండా, తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా చూస్తామని, పాత విధానం వైపే మొగ్గు చూపే అవకాశం ఉందని చెప్పారు.

9న తెలంగాణ మహిళా ఉద్యమకారుల శిక్షణ శిబిరం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఉతమ్మల ప్రపుల్ రాంరెడ్డి, డోలక్ యాదగిరి, తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి7: తెలంగాణ ఉద్యమకారుల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఉతమ్మల ప్రపుల్ రాంరెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అత్యవసర సమావేశం శుక్రవారం చిక్కడపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మేడిపల్లి , ఫిర్జాదీగూడ పరిధి సత్యనారాయణ పురం కాలనీ రోడ్డు నంబర్ 13లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు శిక్షణ శిబిరం కొనసాగనుందని తెలిపారు. వందలాది మంది మహిళా ఉద్యమకారులు పాల్గొంటారని వివరించారు. రాబోయే రోజుల్లో ఉద్యమకారుల పాత్ర, ఉద్యమకారుల హక్కుల అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సమావేంలో జేఏసీ కోశాధికారి చంద్రన్న, ప్రసాద్, ఉద్యమ కళాకారుల వేదిక అధ్యక్షుడు పి.యాదగిరి, ప్రధాన కార్యదర్శి డోలక్ యాదగిరి, నాయులు గింగిరాజు, శంకర్, సురేశ్, ఉమేశ్ పాల్గొన్నారు.

ముగిసిన హరికథా మహోత్సవాలు

కళాకారులను సత్కరించిన జస్టిస్ మాధవి, కేవీ రమణచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 7: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శృంగేరి శంకర మఠంలో హరికథా మహోత్సవాల్లో ముగిసాయి. చివరి రోజు శుక్రవారం భక్త పోతన హరికథా గానం పలువురుని విశేషంగా ఆకట్టుకుంది. బుర్ర సుబ్రహ్మణ్య శర్మ(భాగవతార్)చే భక్తపోతన హరికథా గానం అలరించింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జస్టిస్ మాధవి పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణచారి, హనుమంతరెడ్డి, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టీజీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని టీజేఎంయూ ప్రధాన కార్యదర్శి హనుమంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్ భవన్‌లో ఈడీ మునిశేఖర్, కార్మికశాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు యాజమాన్యానికి వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు. 2017 వేతన సవరణకు సంబంధించిన బకాయి, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. వేల్ఫేర్ బోర్డును రద్దు చేసి ట్రేడ్ యూనియన్లకు వెంటనే అనుమతి ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న అన్ని విభాగాల్లో రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులు సమస్యలపై యాజమాన్యం స్పందించి కార్మిక సంఘాల పిలిచి త్వరగా పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. అధ్యక్షుడు డీవీకే రావు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 7: పద్మారావు నగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన 48 కెమెరాలతో కూడిన సీసీటీవి కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి హాజరయ్యారు. రెప్పఆర్పకుండా నిఘా పెట్టే సీసీ కెమెరాల వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. అనేక కేసులలో కీలకమైన సాక్ష్యాలను అందిస్తున్నాయని తెలిపారు. కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి రంగారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హేమలత, ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు కార్పెట్లను అందజేసిన లయన్స్ క్లబ్

లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు రెండు కార్పెట్లను అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి చేస్తున్న ఉపాధ్యాయులను వారు అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు శేరిపల్లి గణేశ్, ప్రతినిధులు డాక్టర్ ప్రహ్లాద్, మారం సుబ్రమణ్యం, హేమంత్‌కుమార్, సుమన్, రామ్మూర్తికి హెచ్ఎం స్వరూప విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

మంద మల్లేష్ మరణం తీరనిలోటు

మంద మల్లేష్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7: సికింద్రాబాద్ సీనియర్ నాయకులు మంద మల్లేష్ హఠాన్మరణం పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దిగ్భ్రాంతిని, సంతాపం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మల్లేష్ సేవలను ఆయన కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నిధుల దుర్వినియోగం.. అధికారిపై కేసు

బొల్లారం, ఫిబ్రవరి 7: ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసి సస్పెన్షన్‌లో ఉన్న సెరీకల్చర్ (పట్టు గూళ్ల పరిశ్రమ) అధికారిపై మరో అధికారి ఫిర్యాదు చేసిన సంఘటన శుక్రవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరిలోని పట్టు పరిశ్రమ కార్యాలయంలో మార్కెటింగ్ అధికారిగా శివ కుమార్(50) విధులు నిర్వర్తిస్తున్నాడు. తెలంగాణ ప్రాంతం నుంచి పట్టు పురుగుల ద్వారా తయారు అయ్యే పట్టును రైతులు తీసుకువచ్చి తిరుమలగిరి కార్యాలయంలో విక్రయిస్తుంటారు. విక్రయించిన పట్టును కర్ణాటకకు చెందిన డీలర్లు కొనుగోలు చేసి సెరికల్చర్ కార్యాలయం అకౌంట్‌లో డబ్బులు జమచేస్తారు. ఈ నగదును శివకుమార్ రైతులకు చెల్లిస్తాడు. అయితే అవకతవకలకు పాల్పడిన శివకుమార్‌ను కొన్ని నెలల క్రితం అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మోసాన్ని ఆడిటింగ్ అధికారులు ఆడిట్ చేయగా రూ.21లక్షలు శివకుమార్ తన సొంత ఖాతాలో జమ చేసుకున్నట్లుగా తేలింది. మరో రూ.40 నుంచి 50లక్షల రైతులకు చెల్లించాడు. ఆడిట్ చేసిన అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ మహిపాల్‌కు నివేదిక అందజేయడంతో మహిపాల్ తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫిర్యాదును సేకరించిన పోలీసులు శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. త్వరలోనే కేసును చేధించి వివరాలు వెల్లడిస్తామని ఈ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు.